క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కొంతంగిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న డిఎల్‌పీఓ బాలామణి

శంఖవరం: ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ ఎం.బాలామణి సూచించారు. మండలంలోని పి.మల్లాపురం, వేళంగి, గౌరంపేట, ఎస్ జగ్గంపేట, కొంతంగి, మండపం గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్‌ల ద్వారా చెత్త సేకరణ చేసి సంపద సృష్టించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి వర్మి కంపోస్టు తయారు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు అప్పలరాజు, జయలక్ష్మి, భవానిశంకర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం .. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఆర్.నూకరాజు (75) ఆ గ్రామ జెడ్పీ హైస్కూల్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక వీరవరపుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోని గొల్లపేట, దివాణంవీధి, బాడవతోట, పాత బజారువీధి, వడ్ల బంగారమ్మ వీధి, బెల్లపువీధి, నారాయణరాజు వీధి, ప్రకాశం రోడ్డు, ముస్లింవీధి, చిన్నవీధి, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

రెండు నుంచి నూకాలమ్మ జాతర

బోట్‌క్లబ్: స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు మార్చి 2 నుంచి ఏప్రియల్ 15 జరుగుతాయని ఆలయ ఈఓ ఎం.వీరభద్రరావు గురువారం విలేకర్లకు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.



ఏలేశ్వరంలో ఓటుహక్కు వినియోగించుకున్న వైఎస్సార్ సీపీ నేతలు బదిరెడ్డి గోవిందు, ఆశాలత



జగ్గంపేటలో ఓటు వేసిన జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఒమ్మి రఘురాం



ప్రత్తిపాడులో చంటి బిడ్డతో..



గండేపల్లిలో పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న దివ్యాంగురాలు



శంఖవరంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న పట్టభద్రులు



గండేపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో మాట్లాడుతున్న ఏఎస్పీ భాస్కరరావు

పోలింగ్ ప్రశాంతం

- ముగిసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు
- కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు
- నియోజకవర్గంలో 74 శాతం పోలింగ్ నమోదు

ఏలేశ్వరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో 4,967 మంది ఓటర్లు ఉండగా 3,683 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 74 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఏలేశ్వరం మండలంలో ఏలేశ్వరం, రమణయ్యపేట, యర్రవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 1929 మంది ఓటర్లు ఉండగా 1442 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 74.75 శాతం పోలింగ్ నమోదైంది. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ సభ్యురాలు బదిరెడ్డి ఆశాలత ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ కుశరాజు పోలింగ్‌ను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తుని: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 71.3 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలో 3491 మంది ఓటర్లు ఉండగా 2482 ఓట్లు పోలయ్యాయి. తొండంగి మండల పరిధిలో 1852 ఓట్లకు 1163 ఓట్లు పోల్ కాగా 63.8 శాతం నమోదైంది. పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు.

రౌతులపూడి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలవ్యాప్తంగా 919 మంది ఓటర్లకు గాను 683 మంది (74.3 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. 23వ నంబర్ పోలింగ్ కేంద్రంలో 441 మంది ఓటర్లకు గాను 322 మంది, 24వ పోలింగ్ కేంద్రంలో 478 మంది ఓటర్లకు గాను 361 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారని తహసీల్దార్ నరేష్ అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యం సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏఎస్పీ

గండేపల్లి: మండలంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురువారం అడిషనల్ ఎస్పీ ఎంజీవీ భాస్కరరావు పరిశీలించారు. గండేపల్లిలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బందిని ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

76.07 శాతం పోలింగ్

గండేపల్లి మండలంలో 76.07 శాతం పోలింగ్ నమోదైనట్టు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 1337 ఓటర్లకు గాను 1017 మంది ఓటును వినియోగించుకున్నారని చెప్పారు. పోలింగ్ ఉదయం నుంచి మందకొడిగానే సాగింది.

ప్రత్తిపాడులో 75.14 శాతం పోలింగ్

ప్రత్తిపాడు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రత్తిపాడు మండలంలో 75.14 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం 19లో 690 మంది ఓటర్లకు గానూ 525 మంది, పోలింగ్ స్టేషన్ నంబర్ 20లో 553 మందికి 409 మంది వెరసి 1,243 మందికి 934 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ సాయంత్రానికి జోరందుకుంది. ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీపీ గొళ్ల కాంతి సుధాకర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రౌతులపూడి సచివాలయ ఉద్యోగిని దేవర వరలక్ష్మి చంటిబిడ్డను చంకన పెట్టుకుని మండుటెండలో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ట్రైనీ కలెక్టర్ భావన, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కాగా పోలింగ్ కేంద్రాలకు సమీపానే ఉన్న సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు దుకాణాలను, వ్యాపార సంస్థలను మూసివేశారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలు (క్రయవిక్రయాలు) నిలిచిపోయాయి.



ప్రత్తిపాడులో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

కిర్లంపూడి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. రెండు బూతుల్లో 1458 మంది ఓటు వేయాల్సి ఉండగా 917 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ట్రైనీ కలెక్టర్, ఇంచార్జి ఆర్డీఓ హెచ్ఎస్ భావన, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటు వేసేందుకు ఎండలోనే నిలబడుతున్నామని ఓటర్లు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ వెంటనే టెంట్లు వేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జె.చిరంజీవి, ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ, పోలీస్ సిబ్బంది పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు.

శంఖవరం: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ తాతారావు తెలిపారు. మండల వ్యాప్తంగా 876 ఓట్లు ఉండగా 624 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 71 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందుల లేకుండా ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్నవరం ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోకవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గోకవరం మండలంలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ఉదయం 8 గంటల నుంచి పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 1581 ఓట్లకు 1203 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 4 గంటల వరకు క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లకు పోలింగ్ అధికారులు వీరన్న, రాజారావు ఓటు హక్కు కల్పించారు. మండలంలో మొత్తం 76 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తొండంగి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. తొండంగిలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలవ్యాప్తంగా 1852 ఓటర్లు ఉండగా 1184 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 862 మంది కాగా మహిళలు 322 మంది ఉన్నారు. 63.93 శాతం ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి, తహసీల్దార్ మురార్జీ తెలిపారు. కాగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తొండంగిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీసీవై పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ చందక అనూషాయాదవ్ కూడా తొండంగిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గంటల తరబడి.. ఎండలో నిలబడి



జగ్గంపేటలో పోలింగ్ బూత్ వద్ద ఓట్లు వేసేందుకు ఎండలో నిలబడ్డ ఓటర్లు

జగ్గంపేట: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జగ్గంపేటలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా గ్రాడ్యుయేట్స్ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగ్గంపేట సచివాలయం-2 పోలింగ్ కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఎండలోనే క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఓటర్ల నుంచి నిరసన వ్యక్తం కావడంతో కొన్ని గంటల తరువాత అధికారులు టెంట్‌లు ఏర్పాటు చేశారు. జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగ్గంపేట మండలంలో 1846 మంది ఓటర్లకు గాను 1339 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ జీవీఆర్ రమేష్ తెలిపారు. పోలింగ్ బూత్‌లను జిల్లా అడిషనల్ ఎస్పీ జేవీ భాస్కరరావు, పెద్దాపురం ఆర్డీఓ రమణి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



తునిలో ఓటు వేసేందుకు క్యూలో వేచిఉన్న పట్టభద్రులు



రమణయ్యపేట పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



ప్రత్తిపాడులో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



తొండంగిలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టిన ఓటర్లు

నిబంధనలకు తిలోదకాలు



గోపాలపట్నం రహదారిలో టార్పాలిన్లు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ లారీ

- పరిమితికి మించి గ్రావెల్ లోడుతో టిప్పర్ లారీల రాకపోకలు
- రవాణాశాఖ నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు

తొండంగి: రవాణాశాఖ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ లోడుతో టిప్పర్ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. పరిమితికి మించిన గ్రావెల్ లోడుతో అతివేగంగా టిప్పర్లు రాకపోకలు సాగించడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తీరప్రాంతంలో పారిశ్రామిక నిర్మాణాల నిమిత్తం మెట్ట ప్రాంతంలో రౌతులపూడి, శంఖవరం, తుని తదితర ప్రాంతాల నుంచి గ్రావెల్, కంకర, రాళ్లు తదితర మెటీరియల్‌ను టిప్పర్ లారీలపై తరలిస్తున్నారు. రవాణాశాఖ నిబంధనలు ప్రకారం టిప్పర్ లారీల్లో లోడింగ్ చేసిన గ్రావెల్ ఇతర మెటీరియల్ తరలింపు సమయంలో గాలికి ఎగిరి వెనుక వెళ్తున్న వాహనదారుల కళ్లలో పడకుండా టార్పాలిన్లు కట్టాలి. కాగా కొన్ని టిప్పర్లకు మాత్రమే టార్పాలిన్లు మొక్కుబడిగా ఏర్పాటు చేస్తున్నారు. అత్యధికంగా వాహనాలు టార్పాలిన్లు లేకుండా వెళ్తుండటంతో ద్విచక్ర వాహనదారుల కళ్లలో దుమ్ము, ధూళి పడి వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

మితిమీరిన వేగంతో..

గ్రామాల్లో టిప్పర్ లారీల వేగానికి అడ్డూఅదుపూ లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. కొద్దిరోజుల క్రితం గోపాలపట్నం అండర్ బ్రిడ్జి వద్ద స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో యువకులు గాయాలపాలయ్యారు. ఇటీవల గోపాలపట్నం మెయిన్ సెంటర్‌లో పాడిగేదెను టిప్పర్ లారీ ఢీకొట్టి వెళ్లిపోయిందని గ్రామస్తులు తెలిపారు. బెండపూడి జాతీయ రహదారితో పాటు అన్నవరం నుంచి గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, తొండంగి, ఒంటిమామిడి గ్రామాల మీదుగా వెళ్లే టిప్పర్ లారీల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారుల వెంబడి పలు చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండటంతో విద్యార్థులతో పాటు ఇతర వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. దీంతో పాటు కొన్ని సందర్భాల్లో నెంబర్ ప్లేట్లు లేకుండా లారీలు అతివేగంగా రాకపోకలు సాగించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రవాణాశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వాహనాలకు అపరాధ రుసుము విధించినప్పటికీ ఫలితం లేదు. టిప్పర్ లారీల నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణితో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టిప్పర్ లారీల వేగాన్ని నియంత్రించడంతో పాటు నిబంధనలు పాటించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

1న మాదిగల అమరవీరుల దినోత్సవం

ఏలేశ్వరం: గ్రామాల్లో వచ్చే నెల 1న నిర్వహించే మాదిగల అమరవీరుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు కోరారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో అశువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామ, మండల స్థాయిలో అమరవీరుల దినోత్సవం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మురుగు సమస్యకు మోక్షమెప్పుడో ?



చినశంకర్లపూడి గ్రామ సచివాలయం వద్ద నిలిచిపోయిన మురుగు నీరు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చినశంకర్లపూడి గ్రామ సచివాలయం ఎదుట మురుగు నీరు నిలిచిపోయింది. గ్రామ పంచాయతీకి ఆనుకొని ఉన్న డ్రైన్‌లో మురుగు నీటి ప్రవాహానికి స్థానికులు అడ్డుకట్ట వేశారు. దీంతో మురుగునీరు సచివాలయం వద్దే నిలిచిపోతోంది. గత ఐదు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మురుగు కారణంగా దోమలు, ఈగలు పెరిగిపోవడంతో పాటు దుర్వాసన రావడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురికి కూపానికి ఆనుకొని పంచాయతీ కార్యాలయంతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ మురుగు నీరు నెలలు తరబడి నిలిచిపోవడం వల్ల విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో లింగోద్భవ పూజలు



ప్రత్తిపాడు విశ్వేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవకాల అభిషేకాలు చేస్తున్న పండితులు

ప్రత్తిపాడు: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో రుత్విక్కులు విఘ్నేశ్వర పూజతో విశేష అర్చనలకు శ్రీకారం చుట్టారు. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, సహస్ర కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చెరకురసం, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 4.30 గంటల వరకూ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, జల్లిగంపల ప్రభాకరరావు, ఆలయ కమిటీ సభ్యులు రావూరి తాతాజీ, చామర్తి వీరబాబు, కేశవరపు నాగేశ్వరరావు, వేదగాయత్రి బ్రహ్మణ సంఘం ప్రతినిధి అనిసంగరాజు కుక్కుటేశ్వరరావు పాల్గొన్నారు.

మహాశివలింగాన్ని దర్శించుకున్న భక్తులు

ప్రత్తిపాడు ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణాలయంలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన మహా శివలింగాన్ని గురువారం భక్తులు దర్శించుకున్నారు. బీకే తులసీ మహాశివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు. ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి జి.వెంకటరత్నం, విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ తదితరులు మహా శివలింగాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

రెండో రోజూ కొనసాగిన శివరాత్రి వేడుకలు

తొండంగి: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని పెరుమాళ్లపురం సముద్ర తీరంలో తీర్థం జరిగింది. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పెరుమాళ్లపురం సముద్రతీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తీరానికి వచ్చిన భక్తులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో యువత పులిహోర, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.



పెరుమాళ్లపురం సముద్రతీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ఆదిత్య యూనివర్సిటీలో శివరాత్రి వేడుకలు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ అధినేత ఎన్.శేషారెడ్డి, లక్ష్మిరాజ్యం దంపతులు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

ప్రత్తిపాడు రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని శరభవరం, గజ్జనపూడి గ్రామాలకు చెందిన భక్తులు గురువారం రామలింగేశ్వరస్వామి కొలువైన ఎర్రకొండ చుట్టూ గిరి ప్రదక్షిణ (గిరియాత్ర) నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వాకపల్లి, పోతులూరు గ్రామాల మీదుగా 13 కిలోమీటర్ల మేర గిరి యాత్రను చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాదం స్వీకరించారు.



శరభవరం, గజ్జనపూడి గ్రామాల భక్తులు చేపట్టిన గిరి యాత్ర